
సాక్షి ఒడిశా
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6.02.726లు, బంగారం 2గ్రాముల 950 మిల్లీగ్రాములు, వెండి 11గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మావోల డంప్ స్వాధీనం

మల్కన్‌గిరిలో మావోల డంప్ దొరికింది. కొన్ని పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



ఏడీఈఓపై విజి'లెన్స్'

బొడానన ఏడీఈఓపై విజిలెన్స్ దాడులు జరిగాయి. ఇంకా సోదాలు జరుగుతున్నాయి. - 8లో

ఏజెన్సీలో.. సబ్ కలెక్టర్ పర్యటన



జాంత్రీ పంచాయతీలో గిరిజనులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్, ఇతర అధికారులు

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో అభివృద్ధి గిరిజనుల వరకు చేరాలని తొలిసారి జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి ఆయా ప్రాంతాలకు వెళ్లారు. ముఖ్యంగా ఒకప్పుడు ఈ చిత్రకొండ సమితి అంటే కేవలం మావోయిస్టుల ప్రాంతంగానే తెలిసేది. బీఎస్ఎఫ్ జవాన్ల రంగ ప్రవేశంతో మావోల కార్యకలాపాలు తగ్గాయి. ఈ స్వాభిమాన్ ఏరియాలో జాంత్రీ, ఆండ్రాపల్లి, పనాస్‌పూట్, జోడాంబో వంటి పంచాయతీల్లో రెండు రోజులు పర్యటించి అక్కడి పరిస్థితులను సబ్ కలెక్టర్ తెలుసుకున్నారు. ఆయన మంగళ, బుధవారాల్లో పర్యటించారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో గతంలో పోలీసుల సహకారంతోనే ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు వచ్చేవారు. 2018లో గురుప్రియ వంతెన ప్రారంభంతో ఆ అవస్థలు తీరాయి. కానీ ఇప్పటికీ కేవలం జాంత్రీ పంచాయతీకి లాంచీనే శరణ్యం. ఒకప్పుడు ఇక్కడ గంజాయి ఎక్కువగా సాగు చేసేవారు. దీంతో సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి వారి వద్దకు వెళ్లి పసుపు, పప్పులు, ధాన్యం, చోళ్లు, కూరగాయల పంటలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న దీదాయి తెగ గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలపై సమీక్షించారు. హౌసింగ్ పథకాలు ప్రణాళికాబద్ధంగా చేస్తామన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని ఆయన తెలిపారు.



లాంచీలో జాంత్రీకు బయల్దేరిన సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి



రైతులతో చర్చిస్తున్న దుర్యోధన్ బోయి



రైతుల భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



పనాస్‌పూట్‌లో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ దుర్యోధన్

న్యూస్‌రీల్

నర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



నబరంగ్‌పూర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న నర్సింగ్ ఉద్యోగులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో నర్సింగ్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన ప్రారంభించారు. ఏడాది క్రితం ఎల్ అండ్ కే కంపెనీ ద్వారా 38 మంది నర్సులు, ఫార్మసిస్టులను ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంది. ఈ ఏడాది జనవరి 31 వ తేదీ నుండి ఎలాంటి కారణాలు చెప్పకుండా విధుల నుంచి తొలగించింది. దాంతో వీరంతా రోడ్డున పడ్డారు. కలెక్టర్, ఎంఎల్ఎలు, ఎంపీ, జిల్లా మంత్రికి వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడంతో వీరు ఆందోళనకు దిగారు.

జయపురం కళాకారునికి సత్కారం




గుప్తేశ్వర్ పాణిగ్రాహికి సత్కారం

జయపురం: ఒడిశా రాష్ట్ర లోక నృత్య మహోత్సవం-2025 లో జయపురం నాటక, చలచిత్ర, ఆకాశ వాణి కళాకారుడు గుప్తేశ్వర పాణిగ్రహిని సత్కరించారు. గత మూడు రోజులుగా ఒడిశా రాష్ట్ర సుందరఘడ జిల్లా బొనయిగుడలో ఒడిశా లోక నృత్య మహోత్సవం-2025 జరుగుతోంది. కార్యక్రమంలో గుప్తేశ్వర పాణిగ్రహి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. అలాగే ప్రదర్శన కూడా చేశారు. ఆయనను బనయిగుడ ఎమ్మెల్యే లక్ష్మణ ముండ సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు.

విషం తాగి యువకుడి ఆత్మహత్య

రాయగడ: విషం తాగి ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీలోని రేఖాలుగుడ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు రేఖాలుగుడ గ్రామానికి చెందిన ఇలిగా హుయిక చిన్న కొడుకు బలరాం హుయిక (24)లు బుధవారం రాత్రి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. తాను మద్యంతో పాటు విషం తాగానని కుటుంబీకులకు చెప్పాడు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స చేస్తుండగా చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గజరక్షణ అలంకరణ..



గజ ఉద్ధార అలంకరణలో శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్ర

జయపురం: జయపురం శ్రీజగన్నాథ్ మందిరంలో బుధవారం సాయంత్రం శ్రీ జగన్నాథ్, బలభద్ర, సుభద్ర దేవతా మూర్తులను గజ ఉద్ధార (గజ రక్షణ) వేషాలలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ పూజ అనంతరం ద్వార పాలక, సూర్య పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఒక్కరోజు విహార యాత్ర



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిశీలిస్తున్న యువతులు

రాయగడ: జిల్లా సామాజిక సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్లు సంయుక్తంగా ఒక్కరోజు ప్రత్యేక విహార యాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా సామాజిక, సంక్షేమ శాఖ సురక్షా అధికారి ప్రతిమ దాస్, ఆక్షన్ యాడ్ తరుపున రతనేశ్వర్ సాహు, రెవెన్యూ విభాగం అధికారి సూర్యనారాయణ నాయక్ తదితరుల నేతృత్వంలో ఆర్థిక పథకంలో భాగస్తులైన యువతులు వరల్డ్ స్కిల్ సెంటర్, కళింగ స్టేడియం, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాధికారితకు యువత అనుసరించాల్సిన విధి విధానాల గురించి వీరికి వివరించారు.

కాలుష్యం వల్లే వాతావరణంలో మార్పులు



ఎస్‌కేసీజీ కళాశాలలో జాతీయ ముగింపు సమావేశంలో సెంచూరియన్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సాగర్ మైత్రాను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ జేఎన్ పట్నాయిక్



ముగింపు సెమినార్‌కు విచ్చేసిన వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు

పర్లాకిమిడి: భూమి, గాలి, నీరు కలుషితం కావడంతో మన వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని సెంచూరియన్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సాగర్ మైత్రా అన్నారు. స్థానిక కృష్ణచంద్రగజపతి (స్వయంప్రతిపత్తి) కళాశాలలో జాతీయ సెమినార్ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ సాగర్ మైత్రా హాజరయ్యారు. సమావేశానికి ప్రభుత్వ వైద్యాధికారి, సామాజిక వైద్య కేంద్రం (గుమ్మా) డాక్టర్ తన్మయి బిశ్వాళ్, ప్రిన్సిపల్ జితేంద్రనాథ్ పట్నాయిక్, సెమినార్ కన్వీనరు ప్రొఫెసర్ రాధాకాంత భుయ్యాన్ తదితరులు హాజరయ్యారు. ఈ మూడు రోజుల జాతీయ సెమినార్‌కు 116 మంది ప్రతినిధులు హైబ్రీడ్, ఆన్‌లైన్ విధానంలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎన్ పట్నాయిక్ తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాగర్ మైత్రా తన ప్రసంగంలో మాట్లాడుతూ, గజపతి జిల్లాలో వరి తర్వాత రాగులు, కందులు, మొక్కజొన్న ఇటీవల ఎక్కువగా పండిస్తున్నారని అన్నారు. ఇది శుభపరిణామని, ప్రతి ఒక్కరూ రాగి జావ తినడం వల్ల డయాబెటిస్‌కు కొంత వరకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. జిల్లాలో సమీకృత వ్యవసాయ విధానం వల్ల వికసిత్ భారత్ అనే సుస్థిర లక్ష్యాలు-2047 లోగా సాధించవచ్చని అన్నారు. సెంచూరియన్ వర్సిటీలో 'వ్యవసాయ ఉత్పత్తులు' యూనిట్‌ను త్వరలో ప్రారంభిస్తున్నామని డాక్టర్ మైత్రా తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ తన్మయి బిశ్వాళ్ వివిధ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ ప్రాంత గిరిజనులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో అనేక పంటలు పండిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ సాగర్ మైత్రా, గుమ్మా వైద్యాధికారి డాక్టర్ తన్మయి బిశ్వాళ్‌ను సత్కరించారు. ముగింపు సెమినార్‌కు డాక్టర్ ఎం.రెహ్మాన్ ధన్యవాదాలు తెలియజేశారు.

సక్రమంగా పనులు కేటాయించాలి



అదనపు కలెక్టర్ కుహరోకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

రాయగడ: తమకు సక్రమంగా పనులు కేటాయించాలని లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్లు కోరుతున్నారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ రంజన్ కుహరోని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా పనుల శాఖలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సంబంధిత శాఖ అధికారులు ఎటువంటి లైసన్సులు లేనివారికి ప్రలోభాలకు లోబడి కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా 2023, 2024 సంవత్సరాల్లో చేపట్టిన పనులకు సంబంధించి ఆర్‌టీఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్) వివరాలను దాఖలు చేయమన్నా, శాఖ నుంచి ఇంతవరకు ఎటువంటి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరికి మద్దతుగా సీపీఐ(ఎం) పార్టీ జిల్లా అధ్యక్షుడు దొరకొండగిరి, పార్టీ కార్యకర్తలు మద్దతు తెలిపారు.

చురుగ్గా చెక్‌డ్యాం పనులు



నిర్మాణ దశలో ఉన్న చెక్‌డ్యాం



తవ్వించిన చెరువు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఉన్న ఉత్కళ అలూమిన ఇంటర్నేషనల్ కర్మాగారం భారత్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాడిగుడ గ్రామంలో సాగునీటి పనులను చేపట్టింది. హాడిగుడ గ్రామంలో సుమారు 127 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆదివాసీ, హరిజనులైన వీరంతా వ్యవసాయమే జీవనాధారంగా కాలాన్ని గడుపుతున్నారు. అయితే ఈ గ్రామంలోని సుమారు వందకు పైగా ఎకరాలకు సక్రమంగా సాగునీరు అందకపోవడంతో ప్రతి ఏడాది ఇబ్బందులు పడుతున్నారు. అందువలన కర్మాగారం యాజమాన్యం గ్రామానికి సాగునీటి సదుపాయాలు మెరుగుపరిచేందుకు కంకణం కట్టుకుంది. దీనిలో భాగంగా చెక్‌డ్యాం, చెరువులను తవ్విస్తోంది. దీంతో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో సాగునీరు అందే సౌకర్యం కలుగుతుంది. ప్రస్తుతం చెక్‌డ్యాం నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మరో నాలుగు నెలల్లో పనులు పూర్తవుతాయని యాజమాన్యం తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ముగ్గురికి గాయాలు



మృతుడు సదా దొళాయి

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలైన ఘటన జిల్లాలోని కుంభికోట సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి కొరాపుట్ జిల్లా బంధుగాం సమితి కుంభారిపుట్ గ్రామానికి చెందిన సదా దొళాయి (43)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం కుంభారిపుట్ గ్రామానికి చెందిన దొళాయి అతని స్నేహితుడితో కలిసి బైకుపై రాయగడ వైపు వస్తున్నాడు. అదే సమయంలో రాయగడ నుంచి కుంభికోట వైపు వెళ్తున్న మరో బైక్‌పై వస్తున్న ముగ్గురు అదుపుతప్పి ఢీకొన్నారు. ఈ ఘటనలో బైకు నుంచి కిందకుపడిన దొళాయి తీవ్రగాయాలకు గురై, సంఘటన స్థలం వద్దే ప్రాణాలు కోల్పోయాడు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'సనాతని' చిత్ర ప్రదర్శన



సనాతని చిత్రంలో పాత్రధారులు

జయపురం: స్థానిక ఎస్ఆర్ మాల్ ప్రాంగణంలో బుధవారం రాత్రి 'సనాతని' ఒడియా చలన చిత్రం ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఎస్ఆర్ మాల్ యజమాని సుభాష్ రౌత్,జయపురం ఆకాశవాణి అవసరప్రాప్త డైరెక్టర్ నరేంద్ర నాథ్ పట్నాయిక్, మనోజ్ సామంతరాయ్, రంజన్ కుమార్ బెహర, కొరాపుట్ విజిలెన్స్ డివిజన్ ఎస్పీ ప్రద్యుమ్న ద్వివేదీ,కళాకారుడు మురళీ కుమార్ పట్నాయిక్, ప్రముఖ సంగీత కళాకారుడు ధీరెన్ మోహన పటా్నయిక్, కళాకారులు సాగరాక పట్నాయిక్, బాల కృష్ణ పట్నాయిక్, మధుసూధన మిశ్ర, నృశింహనాద్ మిశ్ర, బినోద్ షాడంగి, బిజయ మిశ్ర, గుప్త ప్రసాద్ పాణిగ్రహి, మీనతి మహాపాత్రో తదితరులు చిత్రాన్ని తిలకించారు. ఈ చిత్రానికి దర్శకుడు బాసుదేవ్ బరోడా కాగా నటీ నటులుగా కొరాపుట్ జిల్లా కళాకారులు సంబిత్ ఆచార్య, అంకిత, గుడు, గోపాల పట్నాయిక్, పాపి సంతక, జయపురం కళాకారులు జయంతి శాంత, సంతోషీ ఆచారి, బబులు హీరో, గీతా నాయిక్, త్రిష, జతీంద్ర నాథ్ మహాపాత్రో, ప్రకాశ్ మహంతి తదితరులు నటించారు.

16 నుంచి లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు



వేడుకలకు సిద్ధమవుతున్న మందిరం

రాయగడ:

సదరు సమితి అమలాభట్ట సమీపంలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో, ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేదుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్, వేద పండితులు భాస్కరాచార్యులు తెలియజేశారు. ఈ మేరకు మందిరం ప్రాంగణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కార్యక్రమాల వివరాలు వెల్లడించారు.

చేపట్టనున్న కార్యక్రమాలు

ఈనెల 16 నుంచి ప్రారంభయ్యే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులతో శోభాయాత్ర జరుగుతుంది. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీవిశ్వక్షేన ఆరాధన, పుణ్యాహావాచనం, ఋత్విక్వరుణం, మత్సంగ్రహణం, అంకురార్పణం, నీరాజన కార్యక్రమాలు చేపడతారు. అదేవిధంగా 17వ తేదీన మండపారాధన, మూర్తి కుంభవాహనం, ధ్వజప్రతిష్ట, నీరాజనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇదిలాఉండగా 17వ తేదీ సాయంత్రం స్వామివారి సన్నిధిలో సామూహిక వివాహాలను ఉచితంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్త శ్రీనివాస్ తెలియజేశారు. అదేవిధంగా 18వ తేదీన విశేష హోమంలో భాగంగా శ్రీసుదర్శన నరసింహ హోమం, నీరాజన, మంత్రపుష్ప కార్యక్రమాలు ఉంటాయి. 19వ తేదీన శ్రీలక్ష్మీ హయగ్రీవ హోమం, సాయంత్రం గరుడ వాహన సేవ, 21వ తేదీన చూర్ణోత్సవం, అష్టోత్తర శత కలశాభిషేకం, చక్రతీర్థస్నానం, నిత్య విశేష హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ముస్తాబువుతున్న మందిరం

ఆలయ ప్రథమ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వైభవంగా ముస్తాబు చేస్తున్నారు. సింహద్వారం, గోపురాలకు రంగులను అద్దుతున్నారు. దీనిలో భాగంగా సమీపంలోని నదిని భవశాపనాసని నదిగా నామకరణం చేయనున్నట్లు వేదపండితులు తెలియజేశారు. ఆ నదిలో చక్రస్నానం వంటి పూజాది కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం నదికి నామకరణోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ధర్మకర్త దూడల శ్రీనివాస్ వెల్లడించారు.



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

క్లుప్తంగా

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



వీల్‌చైర్లను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాయగడ: దివ్యాంగుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా గురువారం సదరు సమితి కార్యాలయం ప్రాంగణంలో దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. సమితి పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన 452 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. 16 మందికి దృష్టిహీనత, 28 మందికి వినికిడి లోపం, 66 మందికి శారీరక సమస్యలు, మరో 21 మందిని మానసిక దివ్యాంగులు, 12 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 17 మంది దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, ఏబీడీఓ కాళుచరణ్ మాఝి, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పర్లాకిమిడి: 132/133 కేవీ లైన్ వార్షిక మరమ్మతుల కారణంగా గుమ్మా, కాశీనగర్, గుసాని, రాయఘడ సమితులతో పాటు పర్లాకిమిడిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. వినియోగదారులు గ్రహించాలని టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్ సమయాల్లో మార్పు సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల సముదాయాల (స్కూల్ కాంప్లెక్స్) సమయాల్లో మార్పు సరికాదని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11.45 గంటల వరకు పనిచేస్తున్న పాఠశాలల్లో తరగతులు నిర్వహించి, మధ్యాహ్నం భోజనం బాధ్యతలు చేప ట్టి సుదూర ప్రాంతాల్లో ఉన్న క్లస్టర్ పాఠశాలలకు వెళ్లడం కష్టతరంగా ఉంటుందన్నారు. క్లస్టర్ సమావేశాలు ఉన్న రోజుల్లో పాఠశాలల కు పూర్తి స్థాయిలో సెలవులు ప్రకటించి, సమావేశాలు నిర్వహిస్తే బాగుంటుందన్నారు. ఆ రోజు మెడికల్ లీవ్ తప్ప మరో గత్యంతరం లేకుండా మిగతా సెలవులు విని యోగించరాదనే నిబంధనలు విధించడం ఎంతమాత్రం సరికాదని మండిపడ్డారు. పాత స్కూల్ కాంప్లెక్స్ నిబంధనలు ప్రకారం 50 శాతం ఉపాధ్యాయులు పాఠశాల సముదాయాలకు హాజరైతే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ కలగవని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా సబ్జెక్టు ఉపాధ్యాయులకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహి స్తే ఉపయోగకరంగా ఉంటుందని, మైనర్ మీడి యం ఉపాధ్యాయులకు యథావిధిగా పాఠశాల సముదాయాలనుకొనసాగించాలని వారు కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన వాహనం వద్ద అధికారులు

కంచిలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి.ప్రసాదరావుకు వచ్చిన ముందస్తు సమాచారంతో కంచిలి మండలం దాకరాపల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకున్నారు. బొలెరో వాహనంలో 66 బస్తాలలో తరలిస్తున్న 3,560 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ రమేష్‌బాబును ప్రశ్నించగా కంచిలి గ్రామానికి చెందిన కొత్తకోట నాగరాజు ప్రజల వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసి బరంపురం రవాణా చేస్తున్నట్లు తెలియజేశాడు. దీంతో అధికారులు రూ.1,61,980 విలువైన పీడీఎస్ బియ్యాన్ని, బొలేరో వాహనాన్ని సీజ్ చేసి అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో కంచిలి సివిల్ సప్లయ్ డీటీ పి.కూర్మారావు, విజిలెన్స్ ఎస్‌ఐ రామారావు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల్లో వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజిరేటర్, ఏసీ మెకానిజంలో 30 రోజులు, సీసీ టీవీ ఇన్‌స్టలేషన్ 13 రోజుల పాటు పురుష అభ్యర్థులకు శిక్షణ ఉంటుందని, ఈ నెల 27 నుంచి బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అర్హులకు స్వయం ఉపాధి కల్పించేందుకు బ్యాంకు రుణం సైతం మంజూరు చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'ఉత్కళ భ్రమరో' పుస్తకావిష్కరణ



కవి స్వర్గీయ బృందావన సువారో జయంతి ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అన్నపూర్ణాదేవి



'ఉత్కళ భ్రమరో' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు



ఉత్కళ సమాజ్ భవనంలో కవి బృందావన సువారో జయంతి వేదికపై ముఖ్య అతిథులు

పర్లాకిమిడి:

గజపతి జిల్లాలో పేరొందిన స్వర్గీయ కవి బృందావన సువారో రచించిన 'ఉత్కళ భ్రమరో' పుస్తకాన్ని ముఖ్యఅతిథి విశ్రాంత తహసీల్దార్ పూర్ణచంద్ర మహాపాత్రో ఆవిష్కరించారు. స్థానిక ఒడియా మంగళి వీధి ఉత్కళ హితేషినీ సమాజ్ భవనంలో కవి బృందావన సువారో నూటపద కొండవ జయంతిని అతిథి పూర్ణచంంద్ర మహాపాత్రో ప్రారంభించారు. ఈ సభకు ముఖ్యవక్తగా బిచిత్రానంద బెబర్తా, గౌరవ అతిథిగా మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కళ్యాణీ మిశ్రా, విశ్రాంత ప్రిన్సిపల్ (సంస్కృత మహావిద్యాలయం) డాక్టర్ అన్నపూర్ణాదేవి, ఒడియా అధ్యాపకులు సౌదాగర్ సియో తదితరులు హాజరయ్యారు. పర్లాకిమిడిలో కవి రఘునాథ పోరిచ్చా తర్వాత అంతటి గొప్ప కవి బృందావన సువారో ఒకరని, ఆయన రచించిన పుస్తకాన్ని ఆయన తనయుడు హరప్రసాద్ సువారో అచ్చువేయించి ప్రజల ముందుకు తేవడానికి చాలా కృషి చేశారని, కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత, రిటైర్డు ఉపాధ్యాయులు బినోద్ జెన్నా అన్నారు. ఈ సందర్భంగా బృందావన సువారో రచించిన పుస్తకం 'ఉత్కళ భ్రమరో'ను వేదికపై అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రారంభ గీతాన్ని బి.కోమాలాంగి పాడగా, బిచిత్రా నంద బెబర్తా ధన్యవాదాలు తెలిపారు.

నకిలీ అడ్వకేటు అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితుడు కె.అభిషేక్

పర్లాకిమిడి: అడ్వకేటు అని చెప్పుకుని ఒక మహిళ వద్ద మాయమాటలు చెప్పి రూ.8 లక్షల నగదు, 24 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లిన యువకుడిని పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. స్థానిక డోలా ట్యాంకు రోడ్డులో దండుమాల వీధికి చెందిన ఒక మహిళ వద్ద నుంచి వడ్డీకి రుణంగా రూ.8లక్షలు, 24 గ్రాముల బంగారం తీసుకుని ఖర్చు పెట్టి పరారైన వ్యక్తిని.. మహిళ ఫిర్యాదు మేరకు పర్లాకిమిడి ఆదర్శ పోలీసు స్టేషన్ అధికారి ఐఐసీ ప్రశాంత భూపతి ఆదేశాల మేరకు అరెస్టు చేశారు. దండుమాల వీధికి చెందిన మహిళ వద్ద నుంచి తెచ్చిన 24 గ్రాముల బంగారం ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళంలోని మణప్పురం గోల్డు కార్యాలయంలో కుదువ పెట్టి రూ.98 వేల గోల్డు లోను తెచ్చాడు. వడ్డీకి ఇచ్చిన మహిళ డబ్బులు తిరిగి ఇవ్వమంటే మరో రూ.8 లక్షలు అప్పు ఇస్తే మొత్తం అసలు వడ్డీతో కలిపి చెల్లిస్తానని చెప్పగా.. ఆమె పోయానని గ్రహించి, స్థానిక ఆదర్శ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్‌ఐ కౌతిక సెతి దర్యాప్తు చేపట్టి నిందితుడు కోంచాడ అభిషేక్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అడ్వకేటు అని చెప్పుకుంటూ దండుమాలవీధికి చెందిన కొంచాడ అభిషేక్ చాల మంది వద్ద వడ్డీకి డబ్బులు వాడి తప్పించుకు తిరుగుతున్నట్టు పోలీసు దర్యాప్తులో తేలింది. ఫ్రాడ్ కేసును పోలీసులు విచారిస్తున్నారు.

పన్ను బకాయిల వసూలు



టాక్సులు, అద్దెలు వసూలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

జయపురం: పట్టణంలో అనేకమంది ఇంటి పన్నులు, మున్సిపాలిటీ దుకాణాల అద్దెలు చెల్లించని వారి నుంచి బకాయిల వసూలుతోపాటు ట్రేడ్ లైసెన్స్‌లు, హోల్డింగ్ టాక్స్‌లు, స్టాల్ లైసెన్స్ ఫీజుల వసూలుకు 12 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. జయపురం సబ్ కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి అక్కవరం శొశ్యా రెడ్డి పర్యవేక్షణలో ఈ కమిటీ స్థానిక దైనిక బజారు, రెండో దైనిక బజారు, మహాత్మాగాంధీ రోడ్డు, మహారాణి పేట, బెల్ రోడ్డు, పంచాన మందిరం నుంచి క్రిస్టిన్‌పేట వరకు, కొత్త బస్టాండ్, జయనగర్, సంత తోట, గాంధీ చౌక్, పవర్ హౌస్ కాలనీ, రాజనగర్, ఎస్.కె.టి రోడ్డు తదితర ప్రాంతాల్లో మున్సిపాలిటీ దుకాణాల అద్దెలు, పన్నులు, టాక్స్‌లు వసూలు చేస్తున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు. ఫిబ్రవరిలో నేటి వరకు రూ.6,31,171 వసూలు చేసినట్లు తెలిపారు. హోటళ్లు, మిల్లులు, కల్యాణ మండపాలు, దుకాణాల నుంచి సానిటేషన్ ఫీజు కింద రూ.6,400 వసూలు చేసినట్లు వెల్లడించారు. మున్సిపాలిటీ స్టాల్స్ బకాయిపడిన అద్దెలు మార్చిలోగా రూ.14,29,725 వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఇంత వరకు రూ.58,27,429 వసూలు చేశామన్నారు. గురువారం చేపట్టిన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కూడా పాల్గొన్నారు.

సాంకేతికత ఆధారంగా కేసుల దర్యాప్తు

కొత్తూరు : ఆధునిక సాంకేతికత ఆధారంగా కేసుల దర్యాప్తు ముమ్మురం చేయాలని ఎస్పీ కె.వి.మహే శ్వరరెడ్డి చెప్పారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించిన ఎస్పీ పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మద్యం, నాటు సారాతో పాటు పలు రకాల మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. పెండింగ్ కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. సారా అమ్మకాలు, తయారీ జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో సంక ల్పం అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో మాట్లాడారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహ న కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ మూర్తి, సీఐ చింతాడ ప్రసాదరావు, కొత్తూరు, హిరమండ లం ఎస్‌ఐలు ఎండీ అమీర్ అలీ, మహమ్మద్ యాషి న్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 120 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. జిల్లాలోని పలు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి మెకానికల్, ఎలక్ట్రాని క్స్, ఎలక్ట్రికల్ డిప్లొమా విద్యార్థులు హాజరయ్యా రు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 120 మందిని ఎంపిక చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. దామోదర్‌రావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి బి.తులసీరావు, ఎన్‌ఫీల్డ్ టీం అధికారి విక్టర్ దేవ్ పర్యవేక్షించారు.

బోడా జాతర ప్రారంభం



బోడా జాతర పిలుపునకు బయలుదేరిన పూజారులు

మల్కన్‌గిరి: జిల్లాలో ప్రతీ రెండేళ్లకు ఒకసారి బోడా జాతర నిర్వహిస్తారు. ఫిబ్రవరి 11 నుంచి మార్చి 12వ తేదీ వరకు ఈ యాత్ర ఉంటుంది. బుధవారం రాత్రి దేవతల పిలుపునకు జిల్లా మౌళిమా మందిర్ నుంచి బోడా జాతర కమిటీ సభ్యులు, పూజారులు కన్నమ్‌రాజ్ (శ్రీకృష్ణుడు), బాల్‌రాజ్ (అర్జునుడు), పోతురాజ్ (భీముడు) బయలుదేరి వెళ్లారు. మా ముత్యాలమ్మతో కలిసి బోడా జాతరకు రావాలనే పిలుపునకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉన్న పాల్లేరుకు 100 కిలో మీటర్లు నడకతోనే చేరుకుంటారు. కలిమెల సమితిలో మాన్యంకొండ ముందు ముడు విగ్రహాలను ప్రతిష్టిస్తారు. ఈ విగ్రహాలకు పోల్లేరు నది వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నదిలో కొత్త బోటు తయారుచేసి దానిపైనే తీసుకువస్తారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చివరి ప్రాంతమైన తాడక రేవు వద్ద అమ్మవారి విగ్రహాలతోపాటు వేలాది మంది భక్తులు స్నానం చేస్తారు. అక్కడ నుంచి 7 రోజులపాటు వంద కిలో మీటర్ల దూరం నడిచి మల్కన్‌గిరికి చేరుకుంటారు. ఈ ఏడు రోజులూ ఒక్కో గ్రామంలో అమ్మవారి జాతరను నిర్వహిస్తారు. మన్యంకొండకు మార్చి 3వ తేదీ రాత్రి అమ్మవారు చేరుకుంటారు. మార్చి 8వ తేదీ నుంచి మల్కన్‌గిరిలో జాతర నిర్వహిస్తారు.



గుడి నుంచి బయటకు పిలుపు విగ్రహం



మల్కన్‌గిరి మెయిన్ రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్తున్న పూజారులు



మా మౌళిమ్మ అమ్మవారు

ఏడీఈఓ ఆస్తులపై విజి'లెన్స్'!



బొరిగుమ్మలో పార్థసారథి ఇల్లు (ఇన్‌సెట్లో) ఏడీఈఓ పార్థసారథి బిసాయి

- ఇళ్లు, కార్యాలయంలో సోదాలు
- భారీగా పట్టుబడిన నగదు, బంగారం, ఆస్తులు



ఇంటిలో సోదాలు నిర్వహిస్తున్న విజిలెన్స్ సిబ్బంది

జయపురం: కొట్‌పాడ్ సమితి బొడాసన గ్రామ పంచాయతీ ఏడీఈఓ పార్థసారధి బిశాయి ఆస్తులపై గురువారం జయపురం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆదాయం కన్నా ఎక్కవ ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల ఆధారంగా ఇళ్లు, కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇంతవరకు లభించిన సమాచారం ప్రకారం రూ.2.40 లక్షల నగదు, 285 గ్రాముల బంగారు నగలు, 706 గ్రాముల వెండి, 15 ప్లాట్లు, మూడు భవనాలు, కాజు ఫ్యాక్టరీ (జీడిపిక్కల మిల్లు), 3 ట్రాక్టర్లు, ఒక బలోరా వాహనం కనుగొన్నట్లు తెలిసింది. ఇంకా సోదాలు జరుగుతున్నాయని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



పరేష్ (ఫైల్)



చెట్టును ఢీకొట్టి మృతి చెందిన పరేష్

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గురువారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు భంజనగర్‌కు చెందిన పరేష్ పాత్రో (23) గా గుర్తించారు. గుణుపూర్‌లో గల గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (జి ఐ ఇ టి) విశ్వవిద్యాలయంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న పరేష్ గురువారం బైక్‌పై గుణుపూర్ విశ్వవిద్యాలయానికి వస్తుండగా శుభద్రపూర్ సమీపంలో ఒక చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గుణుపూర్ ఆదర్శ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించి, కుటుంబీకులకు సమాచారం తెలియజేశారు.

మావోల డంప్ స్వాధీనం



జవాన్లు స్వాధీనం చేసుకున్న సామగ్రితో జవాన్లు



మావో డంప్‌లో సామగ్రిలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి సీలకోట పంచాయతీ బపన్‌పల్లి అడవిలో గురువారం 2వ బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లు కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టుల డంప్ దొరికింది. మొత్తం నాలుగు చోట్ల డంప్ కనిపించింది. ఓ డంప్‌లో ప్రెజర్ కుక్కర్‌కు ఐఈడీబాంబు అమర్చి ఉంది. రెండు టిఫిన్ బాంబులు 5 లీటర్లవి, రెండు లీటర్ల టిఫిన్ బాంబ్‌లు 3, మూడు లీటర్ల టిఫిన్ బాంబులు 3, మొబైల్‌ఫోన్ 1, పవర్ బ్యాంక్ ఒకటి, ఎస్‌బీఎమ్‌ఎంల్ గన్ ఒకటి మూడు పెద్ద గన్‌లు, లాంతరులైటు, కరెంటు వైర్లు దొరికాయి.

సమగ్ర పురోగతి ప్రభుత్వ లక్ష్యం: గవర్నర్



బడ్జెటు సమావేశాల్లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో ఇరువురు ఉప ముఖ్యమంత్రులు



17వ శాసన సభ మూడో సమావేశాల్లో తొలిరోజు ప్రసంగిస్తున్న గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి



శాసన సభలో బడ్జెట సమావేశాలు

భువనేశ్వర్: 17వ శాసన సభ మూడో విడత సమావేశాలు గురువారం నుంచి ఆరంభమయ్యాయి. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి ప్రసంగంతో ఈ సమావేశాలు ఆరంభమయ్యాయి. సంప్రదాయ జై జగన్నాథ్ నినాదంతో గవర్నరు తన తొలి ప్రసంగాన్ని ఆరంభించి రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ జగన్నాథుని పట్ల ఆయన భక్తి భావం చాటుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తొలి సారి పగ్గాలు చేపట్టిన బీజేపీ సర్కారు సాఫల్యతని సవివరంగా సభకు తెలియజేశారు. పేదరికం నిర్మూలన, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం, రైతాంగం సమగ్ర సంక్షేమానికి ప్రాధాన్యత, మహిళల సాధికారత బలోపేతం ప్రభుత్వం కీలక ప్రాధాన్యతలుగా ఉన్నాయని గవర్నరు నొక్కి చెప్పారు. ఈ సర్కారు ఆవిష్కరించిన సుభద్ర యోజన అత్యద్భుత పథకంగా పేర్కొన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో కోటి మందికి పైగా మహిళలు లబ్ధి పొందారు. రైతుల పట్ల ప్రభుత్వం అంకితభావానికి ప్రతీక వరి కనీస మద్దతు ధర పెంపు అని, సాగు పెట్టుబడి మద్దతుతో క్వింటాలు వరి రూ. 3,100కి పెంచి రైతాంగానికి ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సంకల్పం సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2036 నాటికి వికసిత్ ఒడిశా సంకల్పబద్ధంగా వ్యూహాత్మక కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. కొత్త విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా 2047 నాటికి భారత దేశ అభివృద్ధి దిశలో ఒడిశా పురోగతిని అనుసంధాన పరచడం లక్ష్యంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. ఉత్కర్ష్ ఒడిశా చొరవ కింద, ఒడిశా ప్రవాసీ భారతీయ దివస్‌ను విజయవంతంగా నిర్వహించిందని, ఈ సందర్భంగా రూ. 12.89 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని పేర్కొన్నారు. కామధేను పథకం కింద, వ్యవసాయ రంగంలో దాదాపు 46 లక్షల మంది మహిళలు, పిల్లలకు పోషకాహార సహాయ కార్యక్రమానికి విశేష పెట్టుబడులు సమకూరుతున్నాయన్నారు. ఐదేళ్లలో 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల ఆవిష్కరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అభయం ఇచ్చారు. అంచెలంచెలుగా రానున్న రెండు ఏళ్లలో 65,000 ఉద్యోగాలు, ఈ వ్యవధిలో జౌళి రంగం 50,000 మందికి ఉపాధి అవకాశాలను ప్రభుత్వం ఆవిష్కరిస్తుందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి వివిధ గృహ నిర్మాణ కార్యక్రమాలకు రాష్ట్రం మద్దతు ఇస్తుంది. 2026 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 115 పట్టణ ప్రాంతాలలో రాత్రింబవళ్లు నిరంతర కుళాయి నీటిని అందించడం తథ్యమని గవర్నరు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లాల అంతటా సమగ్ర రైలు కనెక్టివిటీని విస్తరించడం ద్వారా రవాణా లక్ష్యాలను బలోపేతం చేస్తారని చెప్పారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయితో పట్టుబడిన రాముతో పోలీసులు

గంట్యాడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన బండారు రాము అనే వ్యక్తి గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో గురువారం సాయంత్రం రాము గంజాయి తరలిస్తుండగా తామరాపల్లి జంక్షన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి 1300 గ్రాముల గంజాయిని సీజ్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

2500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



జియ్యమ్మవలస: ప్లాస్టిక్ డ్రమ్ములతో పోలీస్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాల్లో డ్రమ్ముల్లో నిలవ ఉంచిన సారా తయారీకి ఉపయోగించే బెల్లంఊటను గురువారం పట్టుకున్నట్లు చినమేరంగి ఎస్సై అనిష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్పీ సిబ్బంది, క్యాట్‌పార్టీ, ఎస్టీఎఫ్ సిబ్బందితో కలిసి రైడ్ చేసి సారా తయారీ దారుల దగ్గర 25 ప్లాస్టిక్‌డ్రమ్ములను స్వాధీనం చేసుకోగా అందులో 2500లీటర్ల బెల్లం ఊట ఉందని తెలిపారు. ఆ ఊటను ధ్వంసం చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సీతంపేటలో 540 లీటర్లు..

సీతంపేట: మండలంలోని పులిగుమ్మి గ్రామం పరిధిలో సారా వండడానికి నిల్వ చేసిన 540 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన ఊటలు పారబోసినట్లు చెప్పారు.

సాలూరు మండలంలో 1500 లీటర్లు..

సాలూరు రూరల్: మండలంలోని కురుకూటి పంచాయతీ మూటతాడివలస గ్రామం పరిసర ప్రాంతంలో గురువారం రూరల్ పోలీసులు 9 డ్రమ్ములతో 1500 లీటర్ల బెల్లం ఊటను పట్టుకుని ధ్వంసం చేశారు. అలాగే 2 లీటర్ల సారా పట్టుకుని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై నరసింహ మూర్తి తెలిపారు. మండలంలో సారాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా దాడులు నిర్వహిస్తున్నామని ఎస్సై చెప్పారు.

ఆటోబోల్తా: ఒకరి మృతి



సంఘటనా స్థలంలో సూర్యనారాయణ మృతదేహం

విజయనగరం క్రైమ్: ఆటో బోల్తాపడి డ్రైవర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం వింధ్యవాసి గ్రామానికి చెందిన తెర్లి సూర్యనారాయణ (41) తోటి మిత్రులతో కలిసి గురువారం విశాఖపట్నం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల సమయంలో చెల్లూరు హైవేపై వస్తుండగా గుండాల పేట రైల్వేబ్రిడ్జి సమీపంలో హైవేపైన పక్కన ఉన్న ఫుట్‌పాత్‌ను ఢీకొని ఆటో తిరగబడింది. ఈ సంఘటనలో తలకు తీవ్రగాయమైన డ్రైవింగ్ చేస్తున్న సూర్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందా డు. మిగతా ముగ్గురికి తీవ్రగాయాలయ్యా యి. వారిని కేంద్రాస్పత్రికి తరలించారు. బాధి త కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు న మోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ తెలిపారు.

ఏప్రిల్‌లో బ్రెయిన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం: బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రాంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రి వద్ద ఏప్రిల్ మొదటి వారంలో బ్రెయిన్‌హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం నీతిఅయోగ్ నేతృత్వంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ గీతాంజలి గుప్త, సంచాలకుడు ప్రొఫెసర్ రాజేందర్ కె దమిజ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రాంకు పార్వతీపురం మన్యం జిల్లా ఎంపికైనట్లు తెలిపారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల జిల్లాలో న్యూరోలాజికల్ సమస్యలు తగ్గించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దేశ వ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ప్రారంభించనున్న ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టుకు పార్వతీపురం ఎంపిక కావడం గర్వకారణమని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు వేగవంతం

- నేలబావిలో దొరికిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రసాద్ సెల్‌ఫోన్
- గ్రామంలో దర్యాప్తు నిర్వహించిన బొబ్బిలి డీఎస్పీ, రూరల్ సీఐ
- పోలీసుల అదుపులో హత్య కేసులో ప్రధాన నిందితులు?

తెర్లాం: మండలంలో సంచలనం సృష్టించిన నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోనారి ప్రసాద్ అలియాస్ అప్పలనాయుడు హత్య కేసుపై పోలీసులు దర్యాప్తు మరింత వేగవంతం చేశారు. శుక్రవారం బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, పలువురు ఎస్సైలు నెమలాం గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేశారు. ఇదే కేసు విషయమై బుధవారం రాత్రి బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి ప్రసాద్ హత్య జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. దర్యాప్తు వివరాలను బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, తెర్లాం ఎస్సై సాగర్‌బాబులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు మరింత వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు.

నేలబావిలో దొరికిన హతుడి సెల్‌ఫోన్

హత్యకు గురైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోనారి ప్రసాద్ సెల్‌ఫోన్ ఆ రోజు నుంచి స్విచాఫ్ చేసి ఉంది. పొలాల్లో, వేరే ప్రాంతాల్లో ఎంత వెతికినా దొరకలేదు. అయితే గురువారం గ్రామంలోని నేలబావుల్లో పోలీసులు తనిఖీ చేయగా ఓ నేలబావిలో హతుని సెల్‌ఫోన్ దొరికినట్లు తెలిసింది.



హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సీఐని వివరాలు అడిగి తెలుసుకుంటున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

వివాహేతర సంబంధమే కారణమా..?

నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రసాద్ హత్యకు వివాహేతర సంబంధమే ప్రధాన కారణమై ఉండవచ్చన్న ఊహాగానాలు ఎక్కువగా వినబడుతున్నాయి. గ్రామంలో వరసకు పెదనాన్న కోడలితో ప్రసాద్‌కు వివాహేతర సంబంధం ఉందన్న కారణంతోనే ఆమె భర్త, మరిది హత్య చేసి ఉండవచ్చని తెలుస్తోంది. పోలీసులు కూడా ఆ దిశగానే దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో ప్రధాన నిందితులు?

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హత్యకు కారణమైన ప్రధాన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ప్రసాద్‌ను హత్య చేసింది అతని సమీప బంధువులేనని, వరసకు అన్నదమ్ములే అయి ఉండవచ్చని పోలీసులు, గ్రామస్తులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రసాద్ హత్య జరిగిన తరువాత ఇద్దరు వ్యక్తులు గ్రామంలో లేకపోవడంతో వారే హత్య చేసి ఉండవచ్చని, ప్రస్తుతం వారు పోలీసుల అదుపులో ఉన్నారని గ్రామస్తులతో పాటు, మండలంలోని పలువురు చర్చించుకుంటున్నారు.



గురువారం ఓ బావిలో దొరికిన హతుడి సెల్‌ఫోన్

దర్యాప్తు చేస్తున్నాం

ప్రసాద్ హత్య కేసుకు సంబంధించి దర్యాప్తు వేగవంతం చేశామని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు గురువారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. హత్యకు సంబంధించిన వివరాలు సేకరించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే హత్యకు కారణమైన నిందితులను పట్టుకునేందుకు అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నిందితుల ఆచూకీ, మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నామని, ఈ కేసు ఒకటి, రెండు రోజుల్లో ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు

ఆధార్ నమోదులో తప్పులకు తావివ్వవద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఆధార్ నమోదులోను, అప్‌డేషన్‌లోనూ తప్పులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అన్నారు. తప్పుడు సమాచారాన్ని అప్‌లోడ్ చేసే ఆపరేటర్లకు ఫినాల్టీ వేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆధార్ నమోదుపై జిల్లా కమిటీతో సమావేశం నిర్వహించారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, మహిళలు, శాశ్వతంగా మంచాన పడి ఉన్న వారికి ట్రాన్స్ జెండర్లను గుర్తించి ఆధార్ నమోదు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, జీఎస్‌డబ్ల్యూ, పోస్టల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలన్నీ పని చేయాలని చెప్పారు. జిల్లాలో కొత్తగా జన్మించిన శిశువుల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, దీనికి సంబంధించి బర్త్ రిజిస్ట్రేషన్ బేస్డ్ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఇంకా 49,489 మంది 5 సంవత్సరాల మధ్యలో జరగాల్సిన మొదటిసారి మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్, 16 నుంచి 18 సంవత్సరాల మధ్యలో జరగాల్సిన రెండవసారి మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ వంటివి పూర్తి చేసి విద్యార్థులకు నీట్, జేఈఈ ఇతర పరీక్షలకు అడ్డంకులు లేకుండా చేయాలని సూచించారు. 17 సంవత్సరాలకు పైబడి మాండేటరీ బయోమెట్రిక్ పెండింగ్ 54,985 ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో నిర్వహిస్తున్న 9 రకాల స్టేట్ హోల్డర్స్ ఆధార్ సెంటర్లలో ఉన్న ఆపరేటర్లకు ప్రతినెల అవగాహన సదస్సులు నిర్వహించడం, తప్పుడు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసి ఆధార్ సర్వీసులు అందించిన వారిపై అపరాధ రుసుం విధించనున్నట్లు స్పష్టం చేశారు. స్కూల్స్, కాలేజీల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించి మాండేటరీ బయోమెట్రిక్‌లో ఉన్న పెండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, అదనపు ఎస్పీ సౌమ్యలత, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యూ జిల్లా కో ఆర్డినేటర్ రోజారాణి, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు, ఏఎల్‌డీఎం తదితరులు పాల్గొన్నారు.

పశువులను అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్

- పశువుల సంతను సందర్శించిన కలెక్టర్

పార్వతీపురంటౌన్: పశువులను కబేళాలకు తరలించేందుకు అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణ శివారునున్న మార్కెట్ యార్డులో జరుగుతున్న పశువుల సంతను గురువారం ఆయన సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పశువులు, జీవాల క్రయ విక్రయాలు, వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ యార్డులో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్‌ను ఆదేశించారు. పశువులను కబేళాలకు తరలించేందుకు అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు చట్టపరంగా కేసులు నమోదు చేయాలని ఆయన సూచించారు. మార్కెట్లో కల్తీ, నకిలీ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం ఉందని, అరికట్టేందుకు సంబంధిత అధికారులతో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులను ఉపేక్షించేది లేదన్నారు. మార్కెట్‌లో లభిస్తున్న నకిలీ వస్తువుల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హితవు పలికారు.



పశువుల సంతలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

నారాయణపురం 100కౌంట్ చీరలకు భౌగోళిక గుర్తింపు

- లీగల్ కౌన్సిల్ ఎం శ్రీవత్స

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో తయారవుతున్న 100కౌంట్ బొబ్బిలి చీరలకు భౌగోళిక గుర్తింపు చేసినట్లు హైదరాబాద్ నుంచి వచ్చిన వెరిఫికేషన్ అధికారి, లీగల్ కౌన్సిల్ శ్రీవత్స తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ చేయడం వల్ల దేశంలో మరెక్కడా డూప్లికేట్ చీరల తయారీ ఉండదన్నారు. ఎక్కడైనా డూప్లికేట్ చీరలు తయారుచేసినట్లయితే వారిపై కఠిన చర్యలు చేపట్టే అవకాశాలుంటాయని తెలిపారు. దేశంలో మరెక్కడా వీటిని తయారుచేయలేరని, ఒక్క నారాయణపురంలో మాత్రమే తయారుచేస్తారనేది స్పష్టంగా గుర్తింపు ఇచ్చినట్లు చెప్పారు. చీరల నాణ్యత, పొడవు, వెడల్పులను పరిశీలించారు. దీనిని ఏ విధంగా తయారుచేస్తారనేది చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఈ చీరలకు ఎక్కువ ప్రాధాన్యం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.జనార్దనరావు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్.వెంకటరమణ, డిజైనర్ ప్రసాద్, చేనేత కార్మికులు కె.వీర్రాజు, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.



చీరను పరిశీలిస్తున్న లీగల్ కౌన్సిల్ శ్రీవత్స

తల్లిదండ్రుల చెంతకు చేరిన అదృశ్యమైన విద్యార్థి

- విశాఖపట్నంలో పూల దుకాణంలో పనిచేస్తున్న మణికంఠ

తెర్లాం: కొన్ని రోజుల క్రితం అదృశ్యమైన విద్యార్థి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేరాడు. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు, ఎంఈవో త్రినాథరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందబలగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అమలాపురం మణికంఠ అనే విద్యార్థి ఇటీవల పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం చేసి అక్కడినుంచి ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు చుట్టు పక్కల గ్రామాల్లోను, రాజమండ్రిలో ఉంటున్న తల్లిదండ్రుల వద్ద వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మణికంఠ చిన్నాన్న ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మణికంఠ విశాఖపట్నంలోని ఓ పూల దుకాణంలో పనికి చేరాడని తెలియడంతో విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లారు. పూల దుకాణంలో మణికంఠ ఉండడంతో అక్కడినుంచి ఇంటికి తీసుకువచ్చారు. అదృశ్యమైన విద్యార్థి తిరిగి ఇంటికి వచ్చేశాడని తెలుసుకున్న ఎంఈవో త్రినాథరావు, నందబలగ హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అతని ఇంటికి వెళ్లి విద్యార్థితో మాట్లాడారు. అలాగే విద్యార్థి తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కుమారుడిని తీసుకువచ్చి తమ కుమారుడు దొరికాడని, తాము పెట్టిన కేసును ఉపసంహరించుకుంటున్నా మని తెలిపారు.



ఇంటికి వచ్చిన మణికంఠను కలిసిన ఎంఈవో త్రినాథరావు, ఉపాధ్యాయులు

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్ బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా పశువులు తరలిస్తున్న బొలెరో వ్యాన్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుంచి పెదమానాపురానికి వ్యాన్‌లో ఆరు పశువులను తరలిస్తుండడంతో పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసి పశువుల యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

పరిసరాలు పరిశుభ్రం..

- కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని 21వ డివిజన్‌లో గురువారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. నాగవంశం కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన డివిజన్ పర్యటనలో పలు సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను చూసి వెంటనే సదరు యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కొన్నిచోట్ల భవన నిర్మాణ వ్యర్థాలను చూసి సంబంధిత కార్యదర్శులను మందలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, డీఈ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్కంఠగా గుర్రాల పరుగు ప్రదర్శన

- ప్రథమ, ద్వితీయ బహుమతి సాధించిన సింగపూర్ సత్యనారాయణ గుర్రం
- పోటీలో పాల్గొన్న 17 గుర్రాలు
- కళ్లేపల్లిలో హోరాహోరీగా సాగిన ఎడ్ల బళ్ల పోటీలు

లక్కవరపుకోట: మండలంలోని పోతంపేట గ్రామంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీ అత్యంత ఉత్కంఠ భరితంగా సాగింది. గుర్రాలు గాలి వేగంతో దౌడు తీస్తూ ముందుకు సాగాయి. ఈ పోటీలకు రిఫరీగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరాము నాయుడు వ్యవహరించారు. గ్రామంలో పాపమ్మ పేరంటాలు తీర్థమహోత్సవం సందర్భంగా గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలనుంచి కాట్యాడీ, మార్వాడి జాతులకు చెందిన 17 గుర్రాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో లక్కవరపుకోట మండల వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) గుర్రం బహుమతులు సాధించింది. పోటీల్లో గెలుపొందిన గుర్రాల యజమానులకు నగదు బహుమతులను డీసీసీబీ మాజీ అధ్యక్షుడు వేచలపు వెంకట చినరామునాయుడు అందజేశారు. ఈ ప్రాంతంలో గుర్రాల పరుగు ప్రదర్శనకు మంచి ఆదరణ ఉండడంతో వేలాది మంది జనాలు తరలివచ్చారు. కాగా ఈ ప్రాంతంలో ఎక్కడ గుర్రాల పందాలు జరిగినా వేచలపు చినరామునాయుడు రిఫరీగా వ్యవహరించడం విశేషం.



అత్యంత వేంగంగా దౌడుతీస్తున్న గుర్రం



కళ్లేపల్లిలో ఎడ్ల పరుగు పోటీలు

కళ్లేపల్లిలో ఎడ్ల పరుగు ప్రదర్శన

అలాగే కళ్లేపల్లి గ్రామంలో సదాశివ విజయకేశవ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా జరిగిన ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు అత్యంత ఉత్కంఠగా సాగాయి. ఈ పోటీలను చూసేందుకు అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోకం అప్పారావు,మాజీ సర్పంచ్ శీర తాతబాబు, సర్పంచ్ గోకేడ ముసలినాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా సాంస్కృతిక పోటీలు



కల్చరల్ ప్రోగ్రాంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ, జిల్లా పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఏరంగంలోనైనా నైపుణ్యం ప్రధానమని, విద్యార్థులు వారు ఎంచుకున్న రంగంలో నైపుణ్యం మెరుగుపరుచుకుంటే భవిష్యత్తులో మంచిగా రాణిస్తారని జిల్లా పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకుడు వైవీ.రమణ, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. గరివిడిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న 12వ రాష్ట్రస్థాయి వెటర్నరీ పాలిటెక్నిక్ అంతర కళాశాలల క్రీడా సాంస్కృతిక పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. పశు వైద్యాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులు మూగజీవాలకు సేవ చేయాల్సి ఉంటుందని, అందుకు తగిన అన్ని రకాల శిక్షణ విద్యార్థి దశలోనే సక్రమంగా అలవరుచుకోవాలని సూచించారు. మూగజీవులకు వైద్యం చేయడం అదృష్టంగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డా.మక్కేన శ్రీను, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రవికుమార్, పది పశువైద్య కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేస్తున్న జిల్లా పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకుడు, డీఎస్పీ

ఓవరాల్ చాంపియన్ షిప్ విజేతలు వీరే..

క్రీడా సాంస్కృతిక పోటీల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో బాలుర విభాగంలో, అదే విధంగా బాలికల విభాగంలో రెండింటిలో కూడా మడకశిర పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. జానపద గీతాలు, నృత్య పోటీల్లో పలమనేరు కళాశాల నుంచి పి.ప్రణీత ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా గరివిడి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన డి.భవ్యశ్రీ నృత్యంలో మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. అదేవిధంగా బాలురు, బాలికల విభాగంలో సాంస్కృతిక సాహిత్య కార్యక్రమంలో గరివిడి పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది.

మార్చి 2న ప్రవేశ పరీక్ష

పార్వతీపురం: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ఆంగ్లమాధ్యమంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 2న ప్రవేశపరీక్షను నిర్వహించనున్నట్లు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపరీక్షను ఫిబ్రవరి 25న నిర్వహించనున్నట్లు తొలుత ప్రకటించినప్పటికీ ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సొసైటీ గురుకులం, తాడేపల్లి, గుంటూరు వారి ఆదేశాలమేరకు ఫిబ్రవరి 25న జరగాల్సిన పరీక్షను మార్చి 2వ తేదీకి మార్చుచేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి మార్చి 2న రెసిడెన్షియల్ పాఠశాల పి.కోనవలస, ఈఎంఆర్‌ఎస్ గుమ్మలక్ష్మీపురం, ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ భద్రగిరి, ఎస్‌ఓఈ(బాలురు), పార్వతీపురంలోని కేంద్రాలలో నిర్వహించనున్న పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఉదయం 11.30 గంటలనుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు.


కోడిగుడ్లు, మాంసంపై అపోహలు వద్దు

- అప్రమత్తంగా చెక్‌పోస్టు సిబ్బంది
- జిల్లాలో 17 ప్రత్యేకబృందాలు

పార్వతీపురంటౌన్: కోడిగుడ్లు, కోడిమాంసంపై అపోహలు వద్దని పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాధిని గోదావరి జిల్లాలో కోళ్లలో నిర్ధారించడం దృష్ట్యా జిల్లాలోని పశుసంవర్థక శాఖ ముందస్తు చర్యగా జిల్లాలో పశువైద్యాధికారులతో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి లేదని నిర్ధారణ జరిగిందని తెలియజేశారు. జిల్లాలోని కోళ్లలో ఎటువంటి అసాధారణ మరణాలు నమోదు కాలేదని నిర్ధారించినట్లు పేర్కొన్నారు.

చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తం

ముందస్తు వ్యాధి నిరోధక చర్యలలో భాగంగా జిల్లాలోని కోళ్ల రైతులకు తగు నివారణ చర్యలను చేపట్టి వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్త వహించాలని సూచించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కోళ్ల రవాణాపై స్థానిక చెక్ పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. కోడిమాంసం, గుడ్లు వినియోగించేవారు ఎటువంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కోడి మాంసం, గుడ్లు ఎప్పటిలాగే వినియోగించుకోవచ్చన్నారు.



జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు

కోడి గుడ్లు, మాంసాలను బాగా ఉడికించి వినియోగించడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు ఏ సంస్థలు/శాఖలు ధ్రువీకరించలేదని పేర్కొన్నారు.

జిల్లాలో 17 ప్రత్యేకబృందాలు

బర్డ్‌ఫ్లూ వ్యాధి గురించి ఉన్న ఎటువంటి అపోహలు, ఆందోళనలను అయినా నివృత్తి చేయడానికి పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు 17 ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పొరుగు రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి వ్యాధి సోకిన కోళ్ల రవాణా జరగకుండా జిల్లాలో 5 చెక్ పోస్టులలో సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. బర్డ్ ఫ్లూ వ్యాధి నివారణ చర్యల నిమిత్తం మరిన్ని వివరాలకు స్థానిక పశు వైద్యాధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

100 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్సై

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస గ్రామ సమీపంలో ఉన్న జీడి తోటల నుంచి అక్రమంగా తరలిస్తున్న వందలీటర్ల సారాను స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వ్యక్తిని పార్వతీపురం రూరల్ ఎస్సై సంతోషి అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు సారా తరలిస్తున్న ప్రాంతానికి తమ సిబ్బందితో చేరుకుని ఐదు క్యాన్లతో నడక మార్గంలో ఒడిశా నుంచి ఆంధ్ర వైపు తరలిస్తున్న తాడంగి రాజప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అబ్కారీ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సాలూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ అప్పలనాయుడు హితవు పలికారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి ఈగల్ క్లబ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే వారి బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న వారిపై ఈగల్ క్లబ్ నిఘా పెడుతుందన్నారు.

మార్చి 10 నుంచి అగ్ని గంగమ్మ జాతర



పార్వతీపురం రూరల్: ఆంధ్రా-ఒడిశా అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని నీలావడి అగ్ని గంగమ్మ జాతరను మార్చి 10 నుంచి నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బడే సత్యంనాయుడు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సభ్యులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ మార్చి 10న అమ్మవారిని ఆలయం నుంచి ఘటంతో గ్రామంలోని మందిరానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలను నిర్వహిస్తామన్నారు. మార్చి 16వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలను, అర్చనలను నిర్వహించి భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 16 నుంచి వేడుకలను నిర్వహించి 19న డప్పు వాయిద్యాలతో అనుపోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.